క్లుప్తంగా

వలంటీర్ల సేవలు నిరుపమానం



ప్రత్తిపాడు: వలంటీర్ల సేవలు నిరుపమానమని ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందివ్వడం నుంచి వారికి కావలసిన అన్ని రకాల ప్రభుత్వ పథకాలను అందించడంలో వలంటీర్ల పాత్ర అనిర్వచనీయమన్నారు. వలంటీర్లు మరింత బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

అనధికారికంగా మద్యం విక్రయిస్తే చర్యలు

కాకుమాను: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో ఎవరైన మద్యం విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవీంద్ర అన్నారు. మండలంలోని పాండ్రపాడు శివారులో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో శుక్రవారం సాయంత్రం ఎస్‌ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైన మద్యం విక్రయిస్తే అటువంటి వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి నుంచి ఆరు ఫుల్ బాటిల్‌ల మద్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం తిరుపతమ్మ తల్లి

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవత శ్రీ తిరుపతమ్మ తల్లి అని పత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం చల్లావారిపాలెం గ్రామం సీతమ్మ కాలనీలోగల శ్రీ తిరుపతమ్మ తల్లి ఆలయ 7వ వార్షిక కల్యాణ, వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. సమన్వయకర్త ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదం మహాన్నదానం కార్యక్రమాన్ని సమన్వయకర్త ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడి మృతి

పట్నంబజారు: ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐ బి.కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేన్ నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ హుస్సేన్ (25) శుక్రవారం మధ్యాహ్నం స్నేహితులు తోట జయ ఆదిత్య, ఎస్. తరుణ్‌లతో కలిసి ద్విచక్ర వాహనంపై బ్రహ్మానందరెడ్డి స్టేడియం నుంచి హుస్సేన్ నగర్‌వైపు వెళ్లారు. ఎం. కన్వెన్షన్ వద్ద డివైడర్ పక్కన నిలుచుకుని టర్నింగ్ తిప్పుకునే క్రమంలో వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో మహబు హుస్సేన్‌కు తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. జయ ఆదిత్య, తరుణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడి వివరాలు తెలియాల్సి ఉంది.

భారతదేశ అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గంలో ప్రజాపోరు ప్రారంభమైంది. తొలుత స్థానిక కొత్తపేట శివాలయంలో ఆయన పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని ప్రజలు మూడోసారి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఏపీలో అభివృద్ధి కోసం బీజేపీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, చరకా కుమార్ గౌడ్, పోతురాజు వెంకటేశ్వర్లు, కామేపల్లి వెంకటేశ్వర్లు, సురేష్ జైన్, బాబూరావు, మనోజ్, అనిల్, సత్యనారాయణ, వీరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాజాత

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు హ్యాపెన్ సంస్థ శుక్రవారం స్థానిక మిర్చి యార్డులో కళాజాత బృందాలతో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కళాజాత ద్వారా వివరించారు.

విద్యార్థులపై పదింతల శ్రద్ధ

- టెన్త్ పరీక్షలపై స్పెషల్ ఫోకస్
- వంద రోజుల ప్రణాళికతో సన్నద్ధత
- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి
- పట్టణ, మండలంలో పరీక్షలు రాయనున్న 706 మంది విద్యార్థులు



పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన స్టడీ అవర్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులు

పొన్నూరు: ప్రతి విద్యార్థికి పదో తరగతి ఎంతో కీలకం. పబ్లిక్ పరీక్షలంటే వారిలో ఉండే భయాన్ని తొలగించి, మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం, విద్యాభివృద్ధికి కావలసిన అన్నిరకాల సౌకర్యాలను విద్యార్థులకు సమకూరుస్తుండడంతో ఉపాధ్యాయుల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పదో తరగతి అత్యంత ప్రాధాన్యంగా భావించి ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

పొన్నూరు మండలంలో 9 పాఠశాలలు, మున్సిపాలిటీ పరిధిలో 3 పాఠశాలల్లో మొత్తం 706 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యారు. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించింది. పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 100శాతం లక్ష్యంగా ముందుకు సాగుతోంది. గతేడాది జరిగిన పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణతలో మండల ఫస్ట్, మూడో స్థానాన్ని పాఠశాల కైవసం చేసుకుంది. ఈ ఏడాది మార్చి 18 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో జెడ్పీ పాఠశాల నుంచి 264 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు విశేష కృషి చేస్తున్నారు. వంద రోజుల ప్రత్యేక ప్రణాళికతో ప్రతిరోజు మూడు గంటల పాటు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి కావడంతో మోడల్ పేపర్స్ చదివించి విద్యార్థులతో నమూనా పరీక్షలు రాయిస్తున్నారు. ఉపాధ్యాయులు చూపిస్తున్న శ్రద్ధతో విద్యార్థులు సైతం మంచి మార్కులు సాధించేందుకు తోటి విద్యార్థులతో పోటీపడుతున్నారు.



నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

వంద శాతం లక్ష్యం



పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా విద్యార్థులను. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పరీక్షలకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళికతో చదివించి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణతతో పాటు జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

–జె. శివలక్ష్మి, హెచ్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. నిడుబ్రోలు

ప్రత్యేక తరగతులు



పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక తరగతుల నిర్వహణ ద్వారా సబ్జెక్టుల వారీగా తర్ఫీదునిస్తున్నాం. విద్యార్థులకు పరీక్షలపై భయాన్ని పోగొట్టడం, పరీక్షలకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఏ సబ్జెక్టులో అయినా అనుమానాలు ఉన్నట్లైతే వాటిని నివృత్తి చేస్తున్నాం.

– పీవీ శ్రీనివాసరావు, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు. నిడుబ్రోలు

రాజన్న బిడ్డ ఉన్నంత వరకు భయం లేదు

- జగన్ వెంటే మేమంతా అంటున్న మహిళలు, రైతులు, యువకులు
- వేర్వేరు గ్రామాల్లో గుండె గుండెకు జగనన్న... గడప గడపకు కిరణన్న కార్యక్రమం



వైఎస్సార్‌సీపీ కండువా కనిపించగానే సంతోషంతో కిరణ్‌ను పలకరిస్తున్న వృద్ధుడు

గుంటూరు రూరల్: వైఎస్సార్‌సీపీ జెండాతోనే సంక్షేమం, అభివృద్ధి... ఆ జెండానే మాకు ధైర్యం అంటూ వెల్లడిస్తున్నారు పలువురు వృద్ధులు. గుండె గుండెకు జగనన్న...గడప గడపకు కిరణన్న కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలంలో సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ విస్తృత పర్యటనలు చేపడుతున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ గ్రామ ప్రజల ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వారికి వివరిస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా వైఎస్సార్ సీపీ జెండా కనిపించగానే ప్రజలు వారి కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం అంతా ఇంతాకాదు. జెండాను చూడగానే తమను ఆదుకునే జగనన్నే వారి ఇంటికి వచ్చిన ఆనందం పొందుతున్నారు. ఆ జెండాతోనే తమ బతుకులు మారాయని నేడు సంక్షేమ పథకాలు ఇంటివద్దకే అందుతున్నాయని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలు అమ్మఒడి పథకంలో వచ్చే డబ్బుతో చక్కగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం చదువుతున్నారని, ఆసరా డబ్బుతో చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నామని, డ్వాక్రా వడ్డీ మాఫీతో నేడు రుణాలు పొంది ఇళ్ళ వద్దే గేదెలు, చిన్నపాటి పశు సంపదను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందామని మహిళలు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు రైతు భరోసాతో తాము తమ పంటలకు పెట్టుబడులు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలతో ఎక్కడికో వెళ్ళే పనిలేకుండా గ్రామంలోనే అన్ని సమకూరుతున్నాయని వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండి సంతోషంగా ఉన్నామని రైతులు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కనీసం పది మందికైనా గ్రామ సచివాలయ వ్యవస్థలో ప్రభుత్వ కొలువులు వచ్చాయని కొందరు తెలుపుతున్నారు. వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత తమ గ్రామంలో ఏ సమస్యైనా గంటల వ్యవధిలో పరిష్కారం దొరుకుతుందని వృద్ధులు, పెద్దలు తెలుపుతున్నారు. చిన్నారులు సైతం ఒకప్పుడు ప్రైవేటు స్కూల్ పిల్లలను చూసి వారి యూనిఫాం చూసి చిన్నబుచ్చుకునే వారమని కానీ నేడు జగన్ మామ వచ్చిన తరువాత వారికంటే మిన్నగా నేడు మా పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం, స్కూల్ యూనిఫాం, షు, టైలతో మేమే బాగున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 8వ తరగతి విద్యార్థులు తమకు బైజ్యూస్ కంటెంట్ టాబ్‌లతో డిజిటల్ టెక్నాలజీతో ప్రైవేటు స్కూళ్లలో కూడా లేని విద్యావిధానం నేడు మాకు ప్రభుత్వ బడుల్లో అందుతుందని, మధ్యాహ్న భోజనం రోజుకు ఒక రకమైన మెనూ కడుపునిండా తింటున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ళు లేని పేదలు ఇంటి స్థలాలు వచ్చాయని ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్నామని మా చిరకాల సొంతింటి కల నేటికి సాకారమైందని జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఇదిలా ఉంటే గత వారంలో జరిగిన గడపగడపకు కార్యక్రమంలో జొన్నలగడ్డ గ్రామంలో సమన్వయకర్త బలసాని కిరణ్ గ్రామంలో తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటుండగా ఆరుబయట అరుగుపై ఒక తాత కూర్చుని కనిపించాడు. దీంతో కిరణ్ అతనివద్దకు వెళ్ళి ..తాతా ఎలా ఉన్నావ్ అని పలకరించారు. అప్పుడే అటు తిరిగిన ఆ పెద్దాయన కళ్లలో ఒక్కసారిగా ఆనందం పొంగికొచ్చింది. వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్న ఆ వ్యక్తి కొత్తగా ఉన్నా... ఆ వ్యక్తి బుజంపై వైఎస్సార్‌సీపీ కండువా చూడగానే ఆ తాత మోములో చిరునవ్వు వెలిగింది. ఆయన పేరు కేశవరెడ్డి వయసు 76 సంవత్సరాలు. వయోభారం కారణంగా కొంత అనారోగ్యం ఉన్నప్పటికి ఇంటి ఆరుబయట సాయంత్రం అరుగుపై సేదతీరుతున్నాడు. గుండె గుండెకు జగనన్న– గడప గడపకు కిరణన్న కార్యక్రమంలో భాగంగా కేశవరెడ్డిని కలిశారు. ఆ తాత కిరణ్ కుమార్‌ను చూడగానే ఎవరు మీరు అంటూ పలకరిస్తూనే.. నా మనుమడు జగన్ బాబు పంపించాడా మిమ్మల్ని అని చెప్పలేని సంతోషాన్ని వెలిబుచ్చాడు. కిరణ్ కుమార్ తాత రెండు చేతులను పట్టుకుని నేను ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తను నా పేరు కిరణ్ కుమార్.. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మీ వద్దకు వచ్చానని చెప్పారు. ఆరోగ్యం ఎలా ఉంది.. సమయానికి మందులు వేసుకుంటున్నారా.. పింఛన్ వస్తుందా అని ఆరా తీయగానే.. కేశవరెడ్డి బోసినవ్వులతో ఎందుకు రావడం లేదు.. ఒకటో తారీఖునే వలంటీరు బాబు తీసుకొచ్చి ఇస్తున్నాడయ్యా.. మా మనవడు జగన్ బాబు ఉండంత వరకు మాలాంటి వాళ్ళకు భయం లేదు.. మాలాంటోళ్ల ఆరోగ్యానికి ఇబ్బంది లేదు అంటూ కిరణ్ కుమార్ తలపై చేతులు వేసి ఆశీర్వదించాడు. ఇలా ఒక్క జొన్నలగడ్డలోనే కాదు ప్రతి గ్రామంలో ప్రజలంతా జగనే మాకు నమ్మకం, జగన్ వెంటనే మేముటాం...జగనే మా ధైర్యం అంటూ మరింత ఉత్సాహంతో వైఎస్సార్‌సీపీ జెండాలను పట్టుకుని తమకు అండ దొరికిందని ఆ జెండానే వదిలేది లేదని తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. మరలా ముఖ్యమంత్రిగా జగనన్నే కాలవాలని గ్రామా గ్రామాన, ప్రతి కుటుంబంలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్‌ను అందించటం తమ కళాశాల లక్ష్యమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని చిప్స్ కళాశాలలో చెన్నైకి చెందిన ఒమెగా హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో జరిగినప్రాంగణ ఎంపికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరుకాగా మొత్తం 145 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. వారిలో తమ కళాశాలకు చెందిన 80 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులకు ఏడాదికి రూ 2.5 లక్షల వేతనం ఇస్తూ సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, ట్రజరర్ ఆర్ గోపాలకృష్ణలు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్ట్

చేబ్రోలు: అక్రమంగా మద్యం నిల్వ చేసిన వ్యక్తిని చేబ్రోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం స్థానిక జీబీసీ రహదారి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎస్‌ఐ పి. మహేష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. జీబీ నారాయణను అదుపులోకి తీసుకొని అతని వద్య నిల్వ చేసిన 20మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ పి మహేష్ కుమార్ తెలిపారు.

శిశువుల అపహరణ అరికట్టేందుకు పటిష్ట ప్రణాళిక

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిశువుల అపహరణను అరికట్టేందుకు బృహత్తర ప్రణాళికను రూపొందించిందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. కాన్పుల వార్డు వద్ద శుక్రవారం రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ శిశువు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాన్పుల వార్డు, ప్రసూతి వార్డులలో శిశువుల అపహరణ జరుగుతున్న నేపథ్యంలో నిఘా కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పుట్టిన శిశువులకు, తల్లులకు ట్యాగ్ వేస్తున్నట్లు చెప్పారు. ఇద్దరూ వేరు కాకుండా మానిటరీ చేస్తూ, నిఘా ద్వారా శిశువుల అపహరించే వారిని వెంటనే గుర్తించే విధంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్యాగ్ లను ఎవరైనా తొలగించాలని ప్రయత్నిస్తే వెంటనే అలారం మోగి సంబంధిత సిబ్బందిని అలెర్ట్ చేస్తుందని వివరించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం 40 రీడర్లు, అలారంలను అమర్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, గైనకాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ వి.అరుణ, పి. జయంతి, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషా సజని, కాలర్ మేనేజర్ కిరణ్, ఎన్. జగదీశ్ పాల్గొన్నారు.



శిశుతోపాటు, తల్లికి ట్యాగ్ వేసిన దృశ్యాన్ని చూపుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

రైతుల బాధను అర్థం చేసుకోవడంలో కేంద్రం విఫలం



లక్ష్మీపురం: రైతుల బాధల్ని అర్థం చేసుకోవడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విశ్లేషణ సభలో ఆయన మాట్లాడారు. పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోని ఖానోరీ వద్ద ప్రస్తుత యుద్ధ వాతావరణం చూస్తే ప్రభుత్వ మొండి వైఖరి, నియంతృత్వ విధానాలు అర్థం మవుతున్నాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత అధికారి పి.భావన్నారాయణ మాట్లాడుతూ కేంద్రం ఇప్పటికైనా రైతుల ఆవేదనని అర్థం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మురళి, సదాశివం ప్రసంగించారు.

వికసిత్ భారత్ విజయానికి విద్యార్థుల పాత్ర కీలకం

ఏపీఎస్ఎస్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ రవి గుజ్జుల



మాట్లాడుతున్న డాక్టర్ రవి గుజ్జుల

గుంటూరు రూరల్: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో పురోగతి సాధించుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలు సులభతరమవుతాయని ఏపీఎస్ఎస్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ గుజ్జల రవి తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ 2047 విజన్ సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన అగ్రదేశాలకు ధీటుగా భారత దేశాన్ని ఉంచే లక్ష్యంతో రూపొందించిన కార్యక్రమం వికసిత్ భారత్ 2047 విజన్ కార్యక్రమం అని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు అందిస్తున్న తోడ్పాటును వినియోగించుకోవాలని చెప్పారు. ది ఫ్యూచర్ ఈస్ నా షేపింగ్ ఏ డెవలప్డ్ ఇండియా త్రు ఐ టీ ఎనేబుల్డ్ స్కిల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించి విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థుల నైపుణ్య అభివృద్ధిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ కార్యక్రమాల వివరాలను వివరిస్తూ భవిష్యత్‌లో సాంకేతిక రంగ ప్రభావాన్ని ఆయన తెలియజేశారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 247 కళాశాలల్లో అతి తక్కువ సంఖ్యలో మాత్రమే మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు విద్యా బోధనా విధానం అందజేయబడుతుందని, మిగతా అధిక శాతం విద్యార్థుల్లో క్షీణిస్తున్న నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మారుమూల గ్రామీణ స్థాయి విద్యార్థుల వరకు ఫైబర్ నెట్ ద్వారా ఆన్‌లైన్ ప్రత్యక్ష విధానం ద్వారా స్కిల్ డవలప్మెంట్ కార్పొరేషన్ పబ్లిక్ ప్రైవేట్ సెక్టార్‌ల సంయుక్త సహకారంతో నిపుణులచే రూపొందించిన కార్యక్రమాలను అందిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సేవలకు కేంద్ర ప్రభుత్వం నుంచి పురస్కారాన్ని తమ కళాశాల అందుకోవడం జరిగిందని చెప్పారు.

కార్యక్రమంలో అతిథిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్, డాక్టర్ స్వర్ణశ్రీ తదితరులు ఘనంగా సన్మానించారు. కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో సీఎల్‌పీటీ మేలోత్సవ్ 3.0



రిబ్బన్ కట్‌చేసి క్రీడలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ డి సూర్యచంద్రరావు

గుంటూరు రూరల్: ప్రతి మనిషికి దైనందిన జీవితంలో ఆటలు, వ్యాయామం ఎంతో ప్రముఖ్యత కలిగిన విషయాలని ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమీషన్ సెక్రటరీ ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరావు తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజులపాటు రాష్ట్రస్థాయిలో జరగనున్న సీఎల్‌పీటీ మేలోత్సవ్ 3.0 కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్ననాటినుంచి క్రీడలు, వ్యాయామానికి కొంత సమయాన్ని కేటాయిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. క్రమం తప్పకుండా ఇవి రెండు పాటిస్తూ మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, తగ్గించుకుని మంచి ఆరోగ్యం మన సొంతమవుతుందన్నారు. ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ పి.జాన్సన్ మాట్లాడుతూ క్రీడల ద్వారా జ్ఞాపకశక్తి, చురుకుదనం, పిజికల్ ఫిట్‌నెస్ పెరుగుతాయన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు ఆటలపై శ్రద్ధ పెరిగితే ఉత్సాహంగా విద్యలోనూ రాణిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఈ మేలోత్సవ్ కార్యక్రమం రెండు రోజులపాటు జరుగుతుందని కార్యక్రమంలో వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, క్యారమ్స్, చెస్, రన్నింగ్(1500 మీ) వంటి 13 రంగాల్లో బాల బాలికలకు విడివిడిగా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 16 కళాశాలల నుంచి విద్యార్థులు 482 మందికిపైగా తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. క్రీడాకారులకు చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందుకున్న వారితో సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబానికి ఆరోగ్య పరిరక్షణ కల్పిస్తూ ఆర్థిక భరోసాను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని పత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఏటుకూరులోని నియోజకవర్గం కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ఆరోగ్యశ్రీని రూ.25 లక్షలకు పెంచిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని గుర్తు చేశారు. అదేవిధంగా ఆరోగ్య పరిరక్షణతోపాటు వారి కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులు 26వ డివిజన్ అంకిరెడ్డిపాలెంకు చెందిన వైరంగం నాగేశ్వరరావుకు రూ 2.50 లక్షల రూపాయలు, శ్యామల శ్రీకాంత్‌రెడ్డికి రూ 55,000 మొత్తం రూ 3.5 లక్షల రూపాయల చెక్కులను బాధితుల కుటుంబసభ్యులకు సమన్వయకర్త బలసాని చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో అంకిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీవ మనుగడకు విస్తృతమైన అధ్యయనం అవసరం

వీసీ ఆచార్య పి. రాజశేఖర్



ప్రసంగిస్తున్న వీసీ రాజశేఖర్. వేదికపై సదస్సు డైరెక్టర్ ఆచార్య మల్లికార్జున

ఏఎన్‌యూ: జీవ మనుగడకు దోహదం చేసే అంశాలపై విస్తృతమైన అధ్యయనం జరగాల్సిన ఆవశ్యకత ఉందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ అండ్ మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో 'నావల్ ప్రాసెసెస్ అండ్ అప్లికేషన్స్ ఇన్ బయాలజీ' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ ప్రస్తుత సమాజంలోని పరిస్థితులను బట్టి లైఫ్‌సైన్స్ విద్యార్థులు, పరిశోధకులు వారి ఆలోచనల్లోని సృజనాత్మకతను పూర్తిగా ఉపయోగించేలా మానసికంగా సన్నద్ధమవ్వాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న కఠిన పరిస్థితులను నివారించేందుకు జీవశాస్త్ర విధానాలు దోహదం చేస్తాయని తెలిపారు.

సైన్స్ విద్యార్థులు మానవతా విలువలు, మతసామరస్యం కలిగి హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక ప్రపంచాన్ని ఏకీకృతం చేస్తున్న సమయంలో విలువలకు ప్రాధాన్యత ఇవ్వడం అలవర్చుకోవాలని తెలిపారు. శాస్త్రీయ దృక్పథాన్ని మనసా వాచా ఆచరించాలని చెప్పారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. గంగాధరరావు మాట్లాడుతూ కోవిడ్ –19 తరువాత ప్రపంచ శాస్త్ర సాంకేతిక సమాజం ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని, అయినప్పటికీ జీవశాస్త్రంలోని అధునాతన విధానాలతో వాటిని అధిగమించినట్లు తెలిపారు. ప్రధాన వక్తలుగా పాల్గొన్న హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య రాజగోపాల్, ఆచార్య వై. శ్రీనివాసులు, డాక్టర్ ఎస్. సిద్ధార్థ్ అధునాతన అంశాలైన ఫోటో సింథసిస్, ఎపోమిక్స్, మాలిక్యులర్, ఫైల్లో జెనిటిక్స్ వంటి అంశాలపై పరిశోధన సారాంశాన్ని తెలియజేశారు. యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ టి. చంద్రశేఖర్ జీవ వ్యర్థాల నుంచి ఇంధనం తయారీ, వాటి నిర్వహణ పద్ధతులను వివరించారు.